వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA


రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 181 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | డిసెంబర్ 2024 | వెల : రూ 10/-



# దోపిడీ కోసం తెచ్చిందే ధరణి

- రాష్ట్ర భూ వివరాలన్నీ దేశాలు దాటించారు
- అర్ధరాత్రుళ్లు అక్రమ రిజిస్ట్రేషన్లు విదేశాల నుంచి చేశారు
- యాజమాన్య హక్కుల కోసమే భూ భారతి
- కేసీఆర్, కేటీఆర్ దీనికి బాధ్యులు
- వారిని వదిలేది లేదు : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్

భూ యజమానుల హక్కులు కాపాడేందుకే తెలంగాణ భూ భారతి (భూమిపై హక్కుల రికార్డు) బిల్లు-2024ను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ భారతి ప్రాధాన్యతను వివరిస్తూనే,

-మిగతా 3 లో



# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

- లోక్‌సభలో 20, రాజ్యసభలో 19 రోజులు కార్యకలాపాలు
- రెండింటిలోనూ కలిపి కొత్తగా ఏడు బిల్లులకు ఆమోదం
- వాయిదాలు..అంతరాయాలతో విలువైన సమయం వృధా

న్యూఢిల్లీ

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. నవంబర్ 25న ఈ సమావేశాలు ప్రారంభమైన విషయం విదితమే. మొత్తం 26 రోజులకుగానూ.. లోక్‌సభలో 20 రోజులు, రాజ్యసభలో 19 రోజులు కార్యకలాపాలు జరిగాయి. పార్లమెంట్ ముగిసిన అనంతరం

-మిగతా 3 లో



# 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

- దర్యాప్తునకు సహకరించాలి
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్

ఫార్ములా ఈ-రేస్ అక్రమాలపై ఏసీబీ నమోదు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే, మాజీ మంత్రి, కె.తారకరామారావును ఈనెల 30వ తేదీ వరకు అరెస్ట్ చేయరాదని హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేటీఆర్ ఏసీబీ దర్యాప్తునకు సహకరించాలనీ, ఆయన వద ఉన్న డాక్యుమెంట్స్ ఏసీబీ దర్యాప్తు అధికారులకు

-మిగతా 3 లో



# ఫార్ములా-ఈ కార్ రేస్‌పై కొరడా


- కేటీఆర్, మరో ఇద్దరిపై కేసులు
- పీఎంఎల్ఏ, ఫెమా చట్టాల ఉల్లంఘన కింద అభియోగాలు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదు

హైదరాబాద్

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మరో ఇద్దరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు కేసులు నమోదు చేశారు. ఫార్ములా-ఈ

-మిగతా 3 లో

# అసెంబ్లీలో కారు రేసు



- శాసనసభలో బీఆర్ఎస్ సభ్యుల నిలదీత
- అరుపులు..చించివేతలు..హెచ్చరికలు
- వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులు
- మార్షల్స్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య తోపులాట
- స్పీకర్ చైర్‌పైకి పేపర్లు చింపి విసిరేసిన కౌశిక్‌రెడ్డి, వివేకానంద
- మంత్రి పొంగులేటి స్థానం వైపు దూసుకెళ్లేందుకు యత్నం
- పలుమార్లు సభ వాయిదా

-హైదరాబాద్

ఫార్ములా వన్ ఈ-కార్ రేస్‌కు సంబంధించి అసెంబ్లీలో చర్చించాల్సిందే నంటూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. దీంతో శుక్రవారం శాసనసభలో తీవ్ర గందరగోళం, అంతకుమించిన ఉద్రిక్తత చోటు చేసుకున్నది. 'భూ భారతి బిల్లు రాష్ట్ర ప్రజలకు ఎంతో కీలకమైంది, దానిపై ముందుగా చర్చిద్దాం అంటూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వారించినా..వారు వెనక్కి తగ్గకపోవటంతో పలుమార్లు సభ వాయిదా పడింది. 'గవర్నర్ అనుమతినిచ్చిన తర్వాత సభలో ఈ కార్-రేసుపై చర్చించే వీలులేదు.. కేసు ఏసీబీ పరిధిలో ఉంది కాబట్టి అసెంబ్లీలో చర్చించటం సాధ్యం కాదు ' అని కాంగ్రెస్ సభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి విడమరిచి చెప్పినా బీఆర్ఎస్ సభ్యులు తమ నినాదాలను ఆపకపోవటంతో

-మిగతా 3 లో



# అడ్డగోలుగా భూ దోపిడీ

- లోపాలు బయటకు రాకుండా రోజుకో డ్రామా
- అసెంబ్లీలో రౌడీలు, గుండాల్లా ప్రవర్తిస్తున్నారు బీఆర్ఎస్‌పై మంత్రి పొంగులేటి గరంగరం
- కొల్లగొట్టిన భూములు తిరిగి పేదలకు పంచుతామని వెల్లడి
- 'భూభారతి -2024 రెవెన్యూ చట్టం'పై అసెంబ్లీలో చర్చ

హైదరాబాద్

కొత్త రాష్ట్రాన్ని కాపాలా కుక్కల్లా కాపాడుతామంటూ చెప్పిన బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చాక వేట కుక్కల్లా మారి భూదోపిడీకి పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. వారు అందినకాడికి దోచుకున్నారని ఆరోపించారు. ఈ దోపిడీపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామని ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శాసనసభలో భూభారతి

-మిగతా 3 లో



# రాజస్థాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం

- 11 మంది మృతి.. 40 మందికి పైగా గాయాలు
- 28 మంది పరిస్థితి విషమం.. ఆస్పత్రిలో చికిత్స
- మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి, ప్రధాని సంతాపం
- పెట్రోల్ పంపు బయట ట్రక్కు బీభత్సంతో ఘటన

జైపూర్

రాజస్థాన్‌లో దారుణం చోటు చేసుకున్నది. జైపూర్‌లోని ఓ రహదారిపై ట్రక్కు బీభత్సం సృష్టించటంతో అక్కడ భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నది. మంటలు పెట్రోల్ బంకుకూ వ్యాపించాయి. ఈ ఘటనలో 11 మంది

-మిగతా 3 లో

# అవినీతే జరగని చోట ఏసీబీకి పనేంటి?

- సీఎం రేవంత్ రెడ్డిది తప్పుడు ప్రచారం
- ఫార్ములా ఈ రేస్‌తో లాభాలొస్తే కేసులు పెడతారా?
- హైకోర్టు ఉత్తర్వుల పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు హర్షం

హైదరాబాద్

ఫార్ములా ఈ రేస్ ఒప్పందంపై సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా ఈ రేస్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ రూపంలో

-మిగతా 3 లో



# శాన్‌ఫ్రాన్సిస్కోలో జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు

**- శివమణి సహా పలువురు సంగీత కళాకారుల నివాళి**



**న్యూయార్క్**
ఈ నెల 16న కన్నుమూసిన ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు శుక్రవారం ఇక్కడ జరిగాయి. అక్కడకు కొద్ది దూరంలో ప్రముఖ డ్రమ్ వాయిద్యకారుడు శివమణి సహా పలువురు సంగీత కళాకారులు ఆయనకు తమ సంగీత స్వరాలతో ఘనంగా నివాళి అర్పించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫెర్న్‌వుడ్ సిమెట్రీలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. చివరిసారిగా తమ నివాళి ఘటించేందుకు వందల సంఖ్యలో ఆయన అభిమానులు అక్కడకు వచ్చారు. అనంతరం శివమణి మీడియాతో మాట్లాడారు. 1982 నుండి ఇప్పటివరకు సాగిన ఈ ప్రయాణంలో జాకీర్ భాయి నుండి తాను చాలా నేర్చుకున్నానని చెప్పారు. చివరిసారిగా తన నివాళి అర్పించేందుకే తానిక్కడకు వచ్చినట్లు చెప్పారు. తన ప్రతిభతో శాస్త్రీయ సంగీతానికి, పాశ్చాత్య సంగీతానికి మధ్య హద్దులు చెరిపేసిన జాకీర్ హుస్సేన్ భారతదేశం గర్వించదగిన సంగీత విద్యాంసుల్లో ఒకరు. తన ఆరు దశాబ్దాల సంగీత జీవితంలో అనేకమంది జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో కలిసి పనిచేశారు. గ్రామీ విజేత రికీ కెజ్, జాకీర్‌తో తనకు గల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఘనమైన జాకీర్ వారసత్వం ఎన్నటికీ నిలిచి వుంటుందని, రాబోయే తరాలను అమితంగా ప్రభావితం చేస్తూనే వుంటుందని పేర్కొన్నారు.

# రూ.10 లక్షల కోట్లు ఆవిరి

**దలాల్ స్ట్రీట్‌పై ఐదో రోజూ బేర్ పంజా**
**- సెన్సెక్స్ మరో 1,176 పాయింట్లు ఫట్**
**- బోరుమన్న మదుపర్లు**
**-ఏడాది కనిష్టానికి రిలయన్స్ ఇండిస్ట్రీస్ షేర్లు**



**ముంబయి**
దలాల్ స్ట్రీట్‌లో వరుసగా ఐదో రోజూ బేర్ దెబ్బ కొనసాగింది. అమెరికా ఫెడ్ విధానానికి తోడు దేశీయంగా ఎలాంటి ఆర్థిక సానుకూల సంకేతాలు రాకపోవడంతో ఇంతక్రితం రోజూ భారీ నష్టాలను చవి చూసిన మార్కెట్లు.. వారాంతం సెషన్‌లోనూ సెన్సెక్స్ 1200 పాయింట్ల మేర కుప్పకూలి.. 79వేల దిగువకు జారింది. ఫైనాన్సియల్, ఐటీ స్టాక్స్‌ల్లో భారీ ఒత్తిడి చోటు చేసుకోవడంతో అమ్మకాల పరంపర కొనసాగింది. దీంతో శుక్రవారం బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,176 పాయింట్లు లేదా 1.49 శాతం క్షీణించి 78,042 పాయింట్లకు పడిపోయింది. ఉదయం సెన్సెక్స్ 79,335 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత తర్వాత భారీ నష్టాల్లోకి జారుకుని 77,875 కనిష్ఠాన్ని తాకింది. ఎన్ఎస్‌ఈ నిఫ్టీ-50 సూచీ 364 పాయింట్లు లేదా 1.52 శాతం నష్టంతో 23,587కు పరిమితమయ్యింది. ఒక్క పూటలోనే రూ.10.15 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరయ్యింది. దీంతో బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.440.99 లక్షల కోట్లకు పడిపోయింది. ముఖ్యంగా రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఎల్అండ్‌టీ షేర్లు తీవ్ర ఒత్తిడిని చవి చూశాయి. రిలయన్స్ ఇండిస్టీస్ షేర్ 1.7 శాతం నష్టంతో రూ.1,210కి పడిపోయి.. 52 వారాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో నెస్లే ఇండియా, టైటాన్ షేర్లు మినహా మిగిలిన అన్నీ స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

# ఉపేక్షించకండి

**- బీఆర్ఎస్ సభ్యుల తీరుపై**
**- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని**



**హైదరాబాద్**
శాసనసభలో బీఆర్ఎస్ సభ్యుల తీరును సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తప్పుపట్టారు. ఆపార్టీ సభ్యులు విచ్చలవిడిగా సభలో వ్యవహరిస్తున్నా, స్పీకర్ ప్రసాద్‌కుమార్ పూర్తి సహనంతో వ్యవహరించారనీ, అయితే దాన్ని ఆ సభ్యులు దుర్వినియోగం చేశారని చెప్పారు. ఇలాంటి ఘటనలను ఇకపై ఉపేక్షించవద్దనీ, సభాపతిగా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో భూ భారతి బిల్లుపై చర్చ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. భూ భారతి బిల్లును తాము స్వాగతిస్తున్నామంటూ కొన్ని సవరణలు సూచించారు.

# గాజా, వెస్ట్‌బ్యాంక్‌ల్లో ఇజ్రాయిల్ బాధ్యతలేమిటో చెప్పాలి

**-అంతర్జాతీయ న్యాయస్థానాన్ని కోరిన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ**
**-గాజాపై తీర్మానం ఆమోదం**



**న్యూయార్క్ :**
పాలస్తీనియన్ల మనుగడకు అవసరమైన మానవతా సాయం అందించడానికి గాజా, వెస్ట్ బ్యాంక్‌ల్లో ఇజ్రాయిల్ చేపట్టాల్సిన చర్యలు, బాధ్యతలేంటో చెప్పాలని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కోరింది. ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఐసిజె అభిప్రాయాన్ని కోరుతూ నార్వే ప్రతిపాదించిన ఈ తీర్మానం 137-12 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది. 22మంది గైర్హాజరయ్యారు. ఇజ్రాయిల్ మిత్రపక్షమైన అమెరికా ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. 193మంది సభ్యులు గల జనరల్ అసెంబ్లీ తీర్మానానికి చట్టబద్ధంగా కట్టుబడి వుండాల్సిన అవసరం లేనప్పటికీ ప్రపంచ ప్రతినిధుల అభిప్రాయాలేంటనేది ప్రతిబింబిస్తుంది. ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయిల్ మకాం వేయడం చట్ట విరుద్ధమని జులైలో కోర్టు పేర్కొంది. తక్షణమే ఈ ఆక్రమణలకు స్వస్తి చెప్పాలని, అక్కడ ఆవాసాల నిర్మాణాన్ని ఆపేయాలని కోరింది. ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల సంస్థ కార్యకలాపాలపై ఇజ్రాయిల్ నిషేధం విధించిన నేపథ్యంలో గురువారం తీర్మానం వెలువడింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ మాట్లాడుతూ, యుఎన్ఆర్‌డబ్ల్యుఎను నిషేధించినట్లైతే పాలస్తీనియన్ల మౌలికావసరాలను తీర్చాల్సిన బాధ్యత ఇజ్రాయిల్‌దేనని స్పష్టం చేశారు.
గాజాలో వందలు వేల సంఖ్యలో చోటు చేసుకున్న మరణాలకు అంతర్జాతీయ సమాజం బాధ్యతాయుతంగా స్పందించాల్సిన అవసరం వుందని నార్వే డిప్యూటీ విదేశాంగ మంత్రి ఆండ్రెస్ క్రవిక్ వ్యాఖ్యానించారు. ఓటింగ్‌కు ముందు ఇజ్రాయిల్ రాయబారి డానీ డానన్ మాట్లాడుతూ, పనికిరాని విషయాలపైనే మళ్ళీ మళ్లీ సభ్యులు చర్చిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి పాలస్తీనియన్లు ఈ విషయాల్లోకి కొత్తగా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని లాగారని అన్నారు. ఇజ్రాయిల్ బాధ్యతలు, విధులేమిటో స్పష్టంగా చెప్పాల్సిందిగా తీర్మానం ఐసిజెను కోరింది.

# న్యాయపరంగా ఎదుర్కొంటాం

**పొన్నం మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలింది : ఈ కార్-రేస్‌పై మాజీ మంత్రి కేటీఆర్**




**హైదరాబాద్**
ఫార్ములావన్ ఈ-కార్ రేసుకు సంబంధించి తనపై బనాయించిన కేసును న్యాయపరంగా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతే లేదని తేలిందని ఆయన అన్నారు. శుక్రవారం అసెంబ్లీ లాబీల్లో కేటీఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ఏ కార్యక్రమానికైనా డబ్బులు ఖర్చు చేయొచ్చంటూ హెచ్ఎమ్‌డీఏ కార్పొరేషన్ చట్టంలోనే పేర్కొన్నారని గుర్తు చేశారు. హెచ్ఎమ్‌డీఏ చేసే ప్రతీ పనికి ప్రభుత్వ అనుమతులు అవసరం లేదన్నారు. ఆ మేరకు దానికి స్వతంత్రత ఉందని తెలిపారు. ఇలాంటి వాస్తవాలను పక్కనబెట్టి ముఖ్యమంత్రి రేవంత్, కొంతమంది మంత్రులు ప్రజలను పక్కదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్-రేసులో అణాపైసంత అవినీతి లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఔటర్‌రింగ్ రోడ్డు టెండర్లపై ఆయన స్పందిస్తూ%ఔ%ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి తమ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిందనీ, అది అనేక సూచనలు చేసిందని తెలిపారు. మనదేశంలో టీవోటీ విధానం అప్పటికే అమల్లో ఉందని గుర్తు చేశారు. ఆ విధానం ద్వారా ఓఆర్ఆర్ నుంచి వచ్చిన డబ్బులను రైతు రుణమాఫీకి ఉపయోగించామంటూ అంగీకరించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా జాతీయ రహదారుల నుంచి డబ్బులు సేకరిస్తున్న టీవోటీ విధానంలోనే అవుటర్ రింగ్ రోడ్డు నుంచి కూడా డబ్బులను సేకరించామని వివరించారు. తమ ప్రభుత్వం ప్రయివేటు కంపెనీకి లబ్ది చేకూర్చిందనీ, దాంట్లో పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్న సీఎం రేవంత్, ఆ కంపెనీ లీజును ఎందుకు రద్దు చేయటం లేదని ప్రశ్నించారు. అవుటర్ రింగ్ రోడ్డు లీజుకు సంబంధించి గతంలో ఆయన చేసిన ఆరోపణలపైన హెచ్ఎమ్‌డీఏ పరువు నష్టం దావా వేసిందని చెప్పారు. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉందని తెలిపారు. మున్సిపల్, హోం శాఖలు సీఎం వద్దే ఉన్న నేపథ్యంలో ఆయన కింద ఉన్న సిట్, సంబంధిత అధికారులతో వాస్తవాలు ఎలా బయటకొస్తాయంటూ ప్రశ్నించారు. తన సొంత శాఖకు చెందిన అధికారులతో దర్యాప్తు చేయిస్తే నిజానిజాలు ఎలా బయటకొస్తాయో చెప్పాలంటూ కేటీఆర్ ఈ సందర్భంగా సీఎంను ప్రశ్నించారు. అందువల్ల ఓఆర్ఆర్ టెండర్లపై సిట్టింగ్ లేదా రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేయకపోతే ఇది మరో రాజకీయ కక్ష సాధింపు కేసేనని తేలిపోతుందని అన్నారు. టెండర్లలో ఒకవేళ కుంభకోణం జరిగుంటే, అయాచితంగా లబ్ది పొందిన కంపెనీ కాంట్రాక్టును ఎందుకు రద్దు చేయటం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.
ఈ కేసుకు సంబంధించి జడ్జి ఏర్పాటు చేయబోయే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను కూడా అధ్యయనం చేయాలని కోరారు. తద్వారా వాస్తవాలను ప్రజలకు విడమరిచి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కోకాపేటలో రూ.పది వేల కోట్ల కుంభకోణమంటున్న ప్రభుత్వం, అక్కడి భూముల అమ్మకాన్ని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# 12 నూతన మున్సిపాల్టీల ఏర్పాటు

**- పలు గ్రామాల విలీనం**
**-పరిపాలనా సంస్కరణలకు సర్కారు శ్రీకారం**

**-హైదరాబాద్**
రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా కొత్తగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ సన్నాహాలు పూర్తి చేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సిపాల్టీలను అప్‌గ్రేడ్ చేస్తూ ఆదేశాలిచ్చింది. గ్రేడ్-1 మున్సిపాల్టీలుగా ఉన్న వీటికి కార్పొరేషన్ హోదా కల్పించింది. దీంతో రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ల సంఖ్య 14 నుంచి 16కు పెరిగింది. కాగా రాష్ట్రంలో నిజాముల కాలంలో తొలి మున్సిపాల్టీగా హైదరాబాద్ ఉండేది. 1934లోనే దీనికి ప్రత్యేక చట్టం అమల్లోకి తెచ్చారు. పదేండ్ల క్రితం మరోసారి ఈ చట్టానికి సవరణలు చేస్తూ మరింత పటిష్ఠం చేశారు. 10 లక్షల జనాభా ఉంటే మున్సిపల్ కార్పొరేషన్ హోదా కల్పిస్తారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో తాజాగా మరో ఆరు గ్రామాలను సర్కారు విలీనం చేసింది.



**నూతనంగా మరో 12 మున్సిపాల్టీలు**
ప్రభుత్వం మరో 12 మున్సిపాల్టీలు ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలో కోహిర్, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం, జనగాం జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, నారాయణపేట జిల్లాలో మద్దూర్, ఖమ్మం జిల్లాలో ఏదులాపురం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట, మహబూబ్‌నగర్ జిల్లాలో దేవరకద్ర, రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, మెయినాబాద్‌కు మున్సిపాల్టీల హోదా కల్పించారు. లక్షకుపైగా జనాభా ఉంటే మున్సిపాల్టీగా గుర్తిస్తారు.

**గ్రామాల విలీనం**
ఆయా మున్సిపాల్టీల్లో చుట్టుపక్కల ఉన్న గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలా చేసిన వాటిలో పరిగి మున్సిపాల్టీలో మరో ఆరు గ్రామాలు, నర్సంపేటలో ఏడు, నార్సింగిలో ఒకటి, శంషాబాద్‌లో ఒక గ్రామాన్ని విలీనం చేసింది.

**రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు**
గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్, రామగుండం, ఖమ్మం, బడంగ్‌పేట్, బండ్లగూడ, మీర్‌పేట, గ్రేటర్ వరంగల్, జవహర్‌నగర్, నిజామాబాద్, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడతోపాటు మహబూబ్‌నగర్, మంచిర్యాల కూడా కార్పొరేషన్ల జాబితాలో చేరాయి.

# దోపిడీ కోసం తెచ్చిందే ధరణి

(మొదటి తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' వెబ్ పోర్టల్ కుంభకోణాన్ని వివరించారు. భూములకు సంబంధించిన చర్చను అసెంబ్లీలో చేపట్టడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి మేలు జరగాలని తాము భావిస్తున్నామన్నారు. దానికోసమే పటిష్టమైన చట్టాన్ని తెస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో అసెంబ్లీలో ఈ చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ వంటి వారు భూమి కోసమే పోరాటాలు చేశారన్నారు. వారు భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారని వివరించారు. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దుకు కొంతమంది భూమిపై ఆధిపత్యం చలాయించడమే కారణమని చెప్పారు. భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారనీ, నిజమైన భూ యజమానుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు (కేసీఆర్) తన మెదడును రంగరించి ధరణి పేరుతో అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని చెప్పారని ఎద్దేవా చేశారు. 2010లోనే ఒడిస్సా ప్రభుత్వం 'ఈ-ధరణి' పేరుతో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి అప్పగించిందనీ, అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు 'ఈ-ధరణి' పోర్టల్‌ను ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టిందని వివరించారు. అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ తెలంగాణ ప్రజలపై ఎందుకు బలవంతంగా రుద్దారో చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

**ఇదీ ధరణి భాగోతం**

2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థతో పాటు గాదె శ్రీధర్‌కు చెందిన ఈ సెంట్రిక్, విస్సెన్ ఇన్ఫోటెక్ సంస్థలు సంయుక్తంగా కాంట్రాక్టు సాధించు కున్నాయనీ, క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉన్నా, అప్పటి సీఎం కేసీఆర్ ఆ పని చేయలేదన్నారు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారనీ, ఆ తర్వాత ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సబ్సిడరీ కంపెనీ అయిన 'టెరాసిస్' ధరణి కాంట్రాక్టును దక్కించుకుం దన్నారు. ఈ కంపెనీలో 99 శాతం షేర్లను ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ ఎస్‌జీ అనే సంస్థ రెండు దఫాలుగా 2021లో కొనుగోలు చేసిందనీ, మిగిలిన ఒక్క శాతం వాటా మాజీ మంత్రి కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌రాజు కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్‌కు సీఈవోగా అవతారం ఎత్తారని వివరించారు. ఆ తర్వాత ఫాల్కన్ ఎస్‌జీ (ఫిలిప్పీన్స్) సంస్థలోని వంద శాతం షేర్లను సింగపూర్‌కు చెందిన ఫాల్కన్ ఇన్వెస్టిమెంట్స్ (సింగపూర్) అనే సంస్థ కొనుగోలు చేసింది. దీనిలో వందశాతం వాటాలను స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్, జీడబ్ల్యూ స్కై, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్, పారడిగ్మ్ ఇన్నో వేషన్స్, క్వాంటెలా ఐఎన్‌సీ, ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ (సింగపూర్) అనే కంపెనీలు కొను గోలు చేశాయని తెలిపారు. ఆ తర్వాత స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థలో 100 శాతం వాటాలు గేట్‌వే ఫండ్-2 అనే కంపెనీ చేతుల్లోకి వెళ్లాయని చెప్పారు. ఆ కంపెనీ మూలాలు పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు కేంద్రమైన సైమన్స్ ఐలాండ్ అనే దీవిలో ఉన్నాయనీ, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్ సంస్థ మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు నిలయమైన బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్నాయని తెలిపారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదనీ, అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ¬

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

(మొదటి తరువాయి)

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ పనితీరుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. లోక్‌సభలో 54.5 శాతం, రాజ్యసభలో 40 శాతం ఉత్పాదకత జరిగింది. కొత్తగా ఐదు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టగా లోక్‌సభలో నాలుగు, రాజ్యసభలో మూడు బిల్లులు ఆమోదం పొందాయి. భారతీయ వాయుయాన్ విధేయక్ బిల్లుకు ఉభయ సభల్లోనూ ఆమోదం లభించింది. 75 ఏండ్ల రాజ్యాంగంపై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అందులో స్మారక నాణెం, స్టాంప్, రెండు పుస్తకాలను విడుదల చేశారు. అలాగే, రాజ్యాంగంపై ఉభయ సభల్లోనూ చర్చ జరిగింది. లోక్‌సభలో 15.43 గంటల పాటు జరిగిన చర్చలో 62 మంది ఎంపీలు పాల్గొన్నారు. రాజ్యసభలో 17.41 గంటల పాటు జరిగిన చర్చలో 80 మంది సభ్యులు పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రధాని మోడీ, రాజ్యసభలో కేంద్ర హౌం మంత్రి అమిత్ షా చర్చకు సమాధానమిచ్చారు. రాజ్యసభలో అమిత్‌షా చర్చకు సమాధానమిచ్చిన సందర్భంలో ఆయన అంబేద్కర్‌ను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో, బీజేపీ ఆత్మరక్షణలో పడింది. అలాగే, 2024-25 సప్లిమెంటరీ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌పై లోక్‌సభలో 7.21 గంటల పాటు చర్చ జరిగింది. సప్లిమెంటరీ డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌ను ఆమోదించారు. అలాగే వివాదాస్పద జమిలీ ఎన్నికల (ఒకే దేశం.. ఒకే ఎన్నిక)కు సంబంధించి రెండు రాజ్యాంగ సవరణ బిల్లులలో రాజ్యాంగ (129) సవరణ బిల్లును లోక్‌సభ, రాష్ట్రాలకు ఏకకాలంలో నిర్వహించడానికి, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. తగిన మెజారిటీ లేకపోవడంతో ఈ రెండు బిల్లులపై 39 మందితో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేశారు. అయితే ఈ పార్లమెంట్ సమావేశాలను అదానీ ముడుపుల వ్యవహారం, అంబేద్కర్‌ను అవమానిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో పాటు ప్రభుత్వ వైఖరికి సంబంధించిన అంశాలు కుదిపేశాయి.

**అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్షాల ఆందోళన**


శుక్రవారం లోక్‌సభ ప్రారంభం కాగానే జమిలీ బిల్లును జేపీసీకి పంపాలనే తీర్మానంపై లోక్‌సభ ఆమోదం తెలిపింది. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలపై ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. వారి ఆందోళన కొనసాగుతుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జేపీసీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని అర్జున్ మేఘ్వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత, అమిత్ షా వ్యాఖ్యలపై సభలో ప్రతిపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు.

## అడ్డగోలుగా భూ దోపిడీ

(మొదటి తరువాయి)

2024 రెవెన్యూ చట్టంపై చర్చలో మంత్రి మాట్లాడారు. ధరణితో ఎంతో మంది రైతుల జీవితాలు అతలాకుతల మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు దొర చేస్తే శిక్ష అమాయక ప్రజలు ఎందుకు అనుభవించాలని ప్రశ్నించారు. ధరణిలోని లోపాలు, తద్వారా బీఆర్ఎస్ నేతల మోసాలు బయటకు రాకుండా ఉండేందుకు రోజుకో డ్రామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అందులో భాగంగా శాసనసభలో రౌడీలు, గుండాల్లా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తామనీ, ఆ తర్వాత ఎలాంటి విచారణ చేపట్టాలో ఆలోచిస్తామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో విసిరేశామన్నారు. బీఆర్ఎస్ నేతలు కొల్లగొట్టిన పేదల భుములను తిరిగి వారికి ఇస్తామన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలు మొదలుకుని భూయజమానులకు మేలు చేసేలా విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణతో రూపొందించిన భూ భారతి చట్టం అక్షరాలా భూ యజమానులకు చుట్టమని భరోసా ఇచ్చారు. ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వాలు తీసుకువచ్చిన రెవెన్యూ చట్టాలు, సంస్కరణలు రైతాంగానికే కాకుండా యావత్తు ప్రజానీకానికి ఎంతో మేలు చేశాయని చెప్పేందుకు గర్వపడుతున్నానని తెలిపారు. అదే నిబద్ధత, అదే ఆశ, ఆశయాలతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి 2024 రెవెన్యూ చట్టం నిజమైన ప్రజా చట్టం-అక్షరాలా భూమి ఉన్న ప్రతి ఒక్కరికి చుట్టమని వ్యాఖ్యానించారు. భూమి కోసం, భుక్తికోసం వేలాది పీడిత రైతులు, కూలీలు పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమన్నారు. వేలాది పుస్తకాలు చదివిన అపర మేధావిగా, నయా నిజాంగా పేరు ప్రఖ్యాతులు పొందిన ధరణి సృష్టికర్తలు గత పదేండ్లుగా దుర్మార్గంగా వ్యవహరించారని కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. ధరణి సమస్యలను పరిష్కరించక లేకపోవడం, క్షేత్రస్థాయిలో బాధితుల బాధను అర్థం చేసుకోకుండా ధరణిలో ఎలాంటి సమస్యల్లేవంటూ బుకాయించడం బాధాకరమన్నారు.సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన దళిత రైతు మద్దెల కృష్ణయ్య (73) 35 ఏండ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఎం. విజేందర్‌రెడ్డి నుంచి ఏడెకరాల (సర్వేనెం.1452) భూమిని కొన్నారనీ, ధరణి వచ్చిన తర్వాత ఆ భూమి వేరే వాళ్ల పేరుపై పట్టాకావడంతో ఆయన మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి ఇందిరమ్మ రాజ్యంలో మరొకరికి రాకుండా ఉండేలా భూభారతి చట్టాన్ని రూపొందించామని గుర్తు చేశారు. 'అధికార దర్పంతో గత ప్రభుత్వం ధరణి చట్టాన్ని తెచ్చి ప్రజల మీద రుద్దింది. గడీలో కూర్చొని రాత్రికిరాత్రి చట్టాన్ని రూపొందించింది. తప్పు చేసింది దొర.. శిక్ష అనుభవిస్తున్నది రైతులు. వారి బాధలను తొలగించేందుకే భూభారతిని తీసుకురాబోతున్నాం. ఆ బిల్లుపై చర్చ జరుగుతుంటే అడ్డుకోవాలని చూడటం దారుణం' అని బీఆర్ఎస్ నాయకులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను తీర్చేందుకు సభలో బిల్లుపై చర్చ నిర్వహిస్తోంటే బీఆర్ఎస్ సభ్యులు దుర్మార్గంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.

# రాజస్థాన్‌లో ఘోర అగ్ని ప్రమాదం



(మొదటి తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. వారిలో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నది. పదుల సంఖ్యలో వాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్-అజ్మీర్ హైవే వద్ద ఓ పెట్రోల్ పంపు బయట సీఎన్‌జీ ట్యాంకర్ పార్క్ చేసి ఉన్నది. వేగంగా వచ్చిన ఓ ట్రక్కు ఇతర వాహనాలను ఢ కొనటంతో సీఎన్‌జీ ట్యాంకర్‌కు మంటలు అంటుకున్నాయి. మంటలు ఉవ్వెత్తున ఎగిసి అది కాస్తా పెట్రోల్ బంకుకు వ్యాపించాయి. ఈ మంటల్లో 30 ట్రక్కులతో పాటు మరిన్ని వాహనాలు దగ్ధమైనట్టు సమాచారం. ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో 11 మంది చనిపోయారు. 40 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో 28 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. ప్రమాదానికి సంబంధించిన సమాచారం అందగానే 20 అగ్నిమాపక యంత్రాలతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో బంకు నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. పెద్ద ఎత్తున పొగ కమ్ముకున్నది. పేలుడు శబ్దం పది కీలోమీటర్ల దూరం వరకు వినబడినట్టు స్థానికులు చెప్తున్నారు. వాహనాలను ఢకొట్టిన ట్రక్కులో మండే రసాయనాలు ఉన్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. బాధితులను దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేంద్ర హౌం మంత్రి అమిత్ షా, సీఎంతో ఫోన్లో ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ స్పందించారు. జైపూర్ అగ్నిప్రమాద ఘటన చాలా బాధాకరమని రాష్ట్రపతి అన్నారు. బాధిత కుటుంబాలకు రాష్ట్రపతి, ప్రధాని సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున మోడీ ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

## ఫార్ములా-ఈ కార్ రేస్‌పై కొరడా

(మొదటి తరువాయి)

కార్ రేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ), విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టా (ఫెమా)ల కింద వీరిపై ఈసీఐఆర్‌ను శుక్రవారం రాత్రి ఈడీ నమోదు చేసింది.అంతకుముందు, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉదయం ఈడీ అధికారులు ఆ విభాగానికి లేఖ రాసి తెప్పించుకున్నారు. పది పేజీల ఎఫ్ఐఆర్‌తో పాటు దానికి సంబంధించిన ఆధార పత్రాలను కూడా ఈడీ అధికారులు తెప్పించుకొని క్షుణ్ణంగా పరిశీలించి పీఎంఎల్ఏ, ఫెమాల ఉల్లంఘనలు జరిగినట్టు నిర్ధారణకు వచ్చారని తెలిసింది. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి లండన్‌లోని ఎఫ్ఈఓ, ఎస్‌నెక్ట్స్ కంపెనీలకు రూ.54 కోట్లను హెచ్ఎండీఏ ద్వారా ఏ విధంగా బదిలీ చేశారు? హిమాయత్‌నగర్‌లోని ఐఓబీ బ్యాంకు బ్రాంచ్ నుంచి సదరు కంపెనీలకు డాలర్ల రూపంలో డబ్బు మార్పిడి ఏ విధంగా జరిపారు? అందుకు చట్టబద్ధమైన నిబంధనలను ఏ మేరకు పాటించారు? అనే తదితర కోణాల్లో కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను విచారించటానికి ఈడీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం అవసరమైన నోటీసులను సదరు నిందితులకు పంపించటానికి ఇప్పటికే ఈడీ ఏర్పాట్లను పూర్తి చేసినట్టు సమాచారం

## 30 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయొద్దు

(మొదటి తరువాయి)

ఇవ్వాలని ఆదేశించింది. కొన్ని లోపాలు ఎఫ్ఐఆర్‌లో ఉన్న కారణంగా పిటిషనర్‌ను అరెస్టు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు స్పష్టం చేసింది ఏసీబీ, ఫిర్యాదుదారు మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్‌లు కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులిచ్చింది. విచారణను ఈ నెల 27కు వాయిదా వేస్తూ జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ పెట్టిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. దీని తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం వాదిస్తూ, ఫార్ములా రేస్ వల్ల హైదరాబాద్ పేరు ప్రఖ్యాతలు విశ్వవ్యాప్తం అయ్యాయని చెప్పారు. దేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసింగ్ జరిగిందన్నారు. రూ.700 కోట్ల మేరకు రాష్ట్రానికి లబ్ది చేకూరిందన్నారు. రూ.110 కోట్ల మేరకు లాభం వచ్చిందన్నారు. ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుని ఫార్ములా రేసింగ్ కోసం ఒప్పందం చేసుకుందనీ, ఆర్థికంగా బిల్లులు పొందిన ప్రమోటర్స్‌ను కేసులో చేర్చకుండా అవినీతి జరిగిందని ఎఫ్ఐఆర్ నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి జరిగిందని చెబుతున్న వాళ్లు ఫార్ములా రేసింగ్ నిర్వహించిన సంస్థను ఎందుకు కేసులో చేర్చలేదని ప్రశ్నించారు. సీజన్ నైన్ వల్ల ఎన్నో ఆర్థిక, పర్యాటక, ఇతర ప్రయోజనాలు లభించాయని చెప్పారు. ఈ దశలో ఒప్పందం చేసుకున్న వాళ్లలో స్పాన్సర్స్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే ఆ బాధ్యతలు తీసుకుని డబ్బులు చెల్లించిందన్నారు. రెండు విడతల చెల్లింపులు చేశాక కొత్త ప్రభుత్వం చివరి విడత చెల్లించకపోవడంతో సీజన్ టెన్ రద్దయ్యిందన్నారు. దీని వల్ల ఆర్బిట్రేషన్ సమస్యను కూడా ప్రభుత్వం కొని తెచ్చుకుందన్నారు. విధానపరమైన నిర్ణయం తీసుకుంటే అవినీతి జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు.

## అసెంబ్లీలో కారు రేసు..

(మొదటి తరువాయి)

స్పీకర్ వారిపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ గందరగోళం మధ్యే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి 'భూ భారతి' బిల్లుపై చర్చను ప్రారంభించి, ప్రసంగించారు. శాసనసభ శీతాకాల సమావేశాల ఆరో రోజైన శుక్రవారం ఉదయం 10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభ ప్రారంభమైంది. అత్యంత కీలకమైన భూ భారతి బిల్లుపై చర్చించేందుకు వీలుగా ప్రశ్నోత్తరాలను రద్దు చేసిన ఆయన నేరుగా బిల్లుపై చర్చను ప్రారంభించాలంటూ మంత్రి పొంగులేటికి సూచించారు. ఈ దశలో స్పీకర్ అనుమతితో బీఆర్ఎస్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ.. ఫార్ములావన్ ఈ-కార్ రేసుపై అసెంబ్లీలో చర్చించటం ద్వారా ప్రజలకు వాస్తవా లను తెలపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ రేసులో ఎలాంటి అవకతవకలు, అవినీతి జరగ లేదంటూ ఆయన స్పష్టం చేశారు

## అవినీతే జరగని చోట ఏసీబీకి పనేంటి?ం

(మొదటి తరువాయి)

లాభాలొచ్చాయని చెప్పారు. ప్రభుత్వాలకు లాభాలు తెచ్చినందుకు కేసులు పెడతారా? అని ప్రశ్నించారు. అసలు అవినీతే జరగలేదని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారనీ, ప్రొసీజర్ ల్యాప్స్ జరిగి ఉండొచ్చన్నారని తెలిపారు. అవినీతి జరగని దాంట్లో ఏసీబీతో ఎలా విచారణ జరుపుతారని ప్రశ్నించారు. హైకోర్టు అరెస్టు చేయొద్దని ఇచ్చిన ఉత్తర్వులతో కేటీఆర్ నైతిక విజయం సాధించారని తెలిపారు. తాము కేసు పెట్టవద్దనీ కోరలేదనీ, అసెంబ్లీలో చర్చించాలని కోరినట్టు స్పష్టం చేశారు. చర్చకు ఎందుకు ఒప్పుకోలేదు? ప్రజలకు వాస్తవాలు తెలియొద్దా? అని నిలదీశారు. ఫార్ములా ఈ రేస్‌లో రూ.600 కోట్ల అవినీతి అంటూ సీఎం అసత్యాన్ని చెప్పే ప్రయత్నం చేశారని దుయ్యబట్టారు. మిగిలిన 50 శాతం చెల్లించకపోవడం వల్లే రద్దు చేసుకుంటున్నామని సదరు సంస్థ చెప్పిందని గుర్తుచేశారు. 45 లక్షల పౌండ్స్ అంటే సుమారు రూ. 47 కోట్లు అని, రేవంత్‌రెడ్డి రూ.600 కోట్ల నష్టమంటూ శుద్ధ తప్పులు చెప్పారని తెలిపారు. వాస్తవానికి రాష్ట్రానికి ఈ రేస్‌తో రూ. 700 కోట్ల లాభం వచ్చిందని స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్‌తో హైదరాబాద్‌కు రూ. 600-700 కోట్ల మేలు జరిగిందని ప్రఖ్యాత సంస్థ నీల్సన్ 2022లో తెలిపిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పనుల వల్ల రూ.700 కోట్ల నష్టం జరిగిందని విమర్శించారు. రాష్ట్ర ఖజానా నుంచి, నేషనల్ బ్యాంకు నుంచి ఆ సంస్థకు డబ్బులు పంపించారనీ, ఇందులో అవినీతి ఏముంటుందని ప్రశ్నించారు. వస్తు, ధన రూపేనా అవినీతి జరిగితే ఏసీబీకి పనుంటుందనీ, అలాంటిదేమి లేకుండా ఏసీబీ ఏం చేస్తుందని సందేహం వ్యక్తం చేశారు. రూ.42 కోట్లతో తమిళనాడులో ఫార్ములా 4, ఉత్తర్ ప్రదేశ్ రూ.1700 కోట్లతో ఫార్ములా వన్, రూ.103 కోట్లతో చంద్రబాబు 2003లో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ ఢిల్లీలో కామన్ వెల్త్ గేమ్స్ రూ.70 కోట్లతో నిర్వహించడం ఒక స్కాం అని విమర్శించారు.

# సంపాదకీయం

## ఏ ఇంట్లోకైనా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా ?

సినీ నటుడు మోహన్ బాబు ఫ్యామిలీ వ్యవహారంపై కొంత కాలంగా సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. సెలబ్రిటీలు, సామాన్యులు ఇలా ఎవరి ఇంట్లోకి అయినా అనుమతి లేకుండా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా అనేది ప్రశ్న. ఎవరిదైనా ప్రైవేటు స్థలం లేదా భవనంలోకి ఇతర వ్యక్తులు ప్రవేశించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతోంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 329 ప్రకారం, అనుమతి లేకుండా ఇతరుల భవనాలు, స్థలాల్లోకి చొరబడటం ట్రెస్ పాసింగ్ అనే నేరం కిందకు వస్తుంది. దానికి సందర్భం, కారణాలను బట్టి మూడు నెలలు, ఏడాది వరకు జైలు శిక్ష ఉందని చట్టం చెబుతోంది. ఈ విషయంలో జర్నలిస్టులకు ఎలాంటి మినహాయింపు లేదు. భారతదేశ చట్టాల ప్రకారం జర్నలిస్టులు, సామాన్య పౌరులు అంతా సమానమే. మీడియా వారైనా సరే, ఏ సామాన్యుడి ఇల్లు అయినా, సెలబ్రిటీ ఇల్లు అయినా వారి గోడ దాటి అనుమతి లేకుండా లోపలికి ప్రవేశిస్తే వారిపై ఆ భవన యజమాని కేసు పెట్టవచ్చు. బ్లిక్ పర్సనాలిటీల వ్యక్తిగత వ్యవహారంపై ప్రజలందరికీ ఉత్సాహం ఉంటుంది. అందుకే మీడియా దాన్ని రిపోర్ట్ చేయవలసి వస్తుంది. అదే సందర్భంలో మీడియాపై భౌతిక దాడి సరికాదు. తప్పు చేస్తే చట్టపరంగా వెళ్లాలి అనేది జర్నలిస్టుల వాదన. చొరబడటంలో కూడా చాలా రకాలున్నాయి. ఆయుధాలతో రావడం, రహస్యంగా రావడం, గోడ దూకడం, రాత్రి వేళ రావడం, గేట్లు పగలగొట్టడం.. ఇలా నేరాన్ని బట్టి కేసు తీరు మారుతుంది. ఒకవేళ వేరే వారు అక్కడ గేట్లు పగలగొట్టినా ఆ దారిలో మీడియా వాళ్లు వెళ్ళడం కూడా చట్ట ప్రకారం నేరమే. ఈ స్థలం ఫలానా వారిది ట్రెస్పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ అని సాధారణంగా కొన్ని ఖాళీ స్థలాల దగ్గర బోర్డులు పెడుతుంటారు. అనుమతి లేకుండా ప్రవేశించిన వారు శిక్షార్హులు అని దీనర్థం. నిబంధన ఇంటికి, ఇతర ప్రైవేటు స్థలాలకు కూడా వర్తిస్తుంది. మీడియా వారికి, సెలబ్రిటీలకు కూడా ఇందులో మినహాయింపు లేదు. కాకపోతే, అమెరికా వంటి దేశాల్లో ఇది అందరూ పాటిస్తారు. మనదేశంలో చట్టాలపై అవగాహన తక్కువ కాబట్టి, ఎక్కువ మంది దీన్ని గౌరవించరు. కానీ, ఎవరైనా గట్టిగా నిలబడి కేసు పెడితే, కచ్చితంగా చొరబాటు చేసిన వారికి శిక్ష పడుతుంది అంటున్నారు న్యాయనిపుణులు. అంతేకాదు, తమ స్థలం లేదా భవనంలోకి

చొచ్చుకు వస్తున్న వారిని ఆపే హక్కు కూడా ఆ స్థల యజమానులకు ఉంటుంది. అయితే దాని అర్థం భౌతిక దాడులు చేయవచ్చని కాదు. వారిని ప్రవేశించకుండా ఆపవచ్చు అని మాత్రమే చట్టం చెబుతోంది. సాధారణంగా దొంగతనం కోసం, దాడులు చేయడం కోసం, ఆక్రమణ కోసం ఎవరైనా ప్రాపర్టీలోకి వస్తే ట్రెస్పాసింగ్ కేసులు పెడతారు. కానీ మాట్లాడటం కోసం, సమాచారం కోసం, లేదా అసలు ఏ ఉద్దేశం లేకుండా ఊరికే ఇతరుల స్థలంలోకి వెళ్లినా కేసు పెట్టవచ్చా అంటే అవుననే చెబుతోంది చట్టం. అంటే ఇక్కడ చొరబాటుదారుని లక్ష్యం ముఖ్యం కాదు. కాకపోతే ఉద్దేశాన్ని బట్టి శిక్ష తీవ్రత మారవచ్చు. కానీ, అసలు ఏ చెడు ఉద్దేశం లేకుండా వెళ్లినా నేరం నేరమే. ఒదుకంటే, రేపు ఎవరో ఒకరు నీ ఇంటి ముందుకు వచ్చి కూర్చుంటారు. నాకే ఉద్దేశమూ లేదు. ఊరికే మీ ఇంటి ముందు నుంచుంటా అంటే చెల్లదు కదా? బోర్డు పెట్టినా, పెట్టకపోయినా, ప్రతి ప్రైవేటు ఆస్తి మీద యజమానికి హక్కు సహజంగా ఉంటుంది. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే జర్నలిస్టులపై 2020లో ఈ తరహా కేసు పెట్టించారు. తన నివాసంలోకి అక్రమంగా చొరబడ్డారు అంటూ రిపబ్లిక్ టీవీ రిపోర్టర్, కెమెరా పర్సన్, ఆ బండి నడిపిన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అలాగే 2018లో చెన్నైలోని ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను వీడియో తీస్తున్న ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టమవుతోంది. చట్ట ప్రకారం పోలీసులు కూడా ప్రైవేటు ప్రాపర్టీలోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం ఉండాలి. ఒకటి వారికి ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండాలి లేదా, వారికి అక్కడ తీవ్రమైన నేరం, తక్షణం ఆపించాల్సిన నేరం జరుగుతోందన్న కచ్చితమైన సమాచారం వచ్చి ఉండాలి, లేదా కోర్టు లేదా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం వచ్చి ఉండాలి. అప్పుడే మాత్రమే పోలీసులు ప్రైవేటు ప్రాపర్టీలోనికి అడుగు పెట్టగలరు. అయితే భారతదేశంలో చాలా వరకు ఈ చట్టం మీద అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్న వారు కూడా పోలీసులతో అనవసర గొడవ ఎందుకు అనుకుని ఊరుకోవడం సహజంగా కనిపిస్తుంది. ఇక, చొరబడటం మాత్రమే కాదు ఒక వ్యక్తి వెంటపడటం, వెంబడించడం కూడా శిక్షార్హమైన నేరమే. తరచూ వెంటబడటం, ఎక్కడకు వెళ్లినా వెనకాలే వెళ్లడం వంటివి చట్ట ప్రకారం స్టాకింగ్ అనే నేరం కిందకు వస్తాయి. అయితే విస్తృతమైన ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న అంశాల్లో కొన్ని సార్లు మీడియా వెళ్లాల్సి రావచ్చు. అప్పుడు కూడా అది చట్ట వ్యతిరేకమే అయినప్పటికీ విస్తృతమైన ప్రజాప్రయోజనం ఉంది కాబట్టి దాన్ని వెలికితీయడానికి కాస్త రిస్క్ తీసుకోవడం అవసరం అనే వాదన చేయచ్చు. కానీ, అప్పుడు కూడా అది అంతగా ప్రజాప్రయోజనంతో ముడిపడింది అవ్వడం, అందులో కూడా వ్యక్తుల ప్రైవసీకి భంగకరం కాని రీతిలో వ్యవహరించడం లాంటి అంశాలు ముడిపడి ఉంటాయి. చీటికి మాటికీ ఎక్కడ పడితే అక్కడికి మైకులు తీసుకుని దూసుకువెళ్లే అధికారం సాధారణ ప్రజలకు ఎలా ఉండదో మీడియాకు కూడా ఉండదు. దాదాపు పదేళ్ళ క్రితం చిరంజీవి ఇంట్లో ఒక ప్రైవేటు కార్యక్రమం జరిగినప్పుడు ఒక ఇంగ్లీషు పత్రిక ఫోటోగ్రాఫర్ గోడదూకి ఆ కార్యక్రమం లోపలికి వెళ్లారు. అప్పుడు అతనిపై పవన్ కళ్యాణ్ భౌతిక దాడి చేశారు. తరువాత ఫిలిం చాంబర్ లో సినిమా పెద్దలు ఆ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తాజాగా మోహన్ బాబు ఇంటిలోకి మీడియా వెళ్లింది. ఆయనా దాడి చేశారు. ఈ మధ్య ఒక తెలంగాణ నార్కొటిక్స్ అధికారిని ఇంటర్వ్యూ ఇవ్వమంటూ ఒక మహిళా జర్నలిస్టు మీదమీదకు వెళ్లిన ఘటన కూడా ఇటువంటిదే. చిరంజీవి ఘటన సమయంలోనూ ప్రైవసీ అనే అంశం చర్చకు వచ్చింది. మీడియా కూడా తనకున్న పరిమితులు తెలుసుకోవాలి. అందరి ప్రైవసీని మీడియా గౌరవించాల్సిందే. దాన్ని ఉల్లంఘించే హక్కు లేదు. మీడియా కూడా తన పరిమితులు తెలుసుకుని, అక్కడ ఏం జరుగుతోందో చెప్పవచ్చు. రిపోర్ట్ చేయవచ్చు. కానీ ఆవేశపూరిత పరిస్థితులు కుటుంబంలో ఉన్నప్పుడు మధ్యలోకి వెళ్లకూడదు. మీడియా ఆవేశంలో వెళ్లడం పొరబాటు అనిపిస్తుంది. కానీ దానికి ప్రతిగా భౌతిక దాడి చేయడం కూడా సరికాదు. కొందరు అవగాహన లేని మీడియా ప్రతినిధులు అత్యుత్సాహం చూపుతుంటారు.

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?

ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళ్లు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు!

ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు




వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా! మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

# క్రికెట్ మేధావి

బ్యాటర్ బుర్రను చదివేసే మేధావి అతను. ఏ షాట్‌కు ఎలా వికెట్ పడగొట్టాలన్న ప్రణాళిక వేసుకునే ఇంజనీర్ అతను. బంతిపై పట్టు సాధించి వేళ్లతోనే మాయ చేసే మాంత్రికుడు. మొత్తంగా విభిన్నమైన అస్త్రాలతో ప్రత్యర్థి జట్టును కకావికలం చేయగల స్పిన్ యోధుడు. ప్రపంచ క్రికెట్‌లో అతికొద్ది మందికి మాత్రమే సాధ్యమయ్యే ఘనతలెన్నో అందుకున్న బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ ఆటను ముగించాడు. పద్నాలుగేళ్ల తన సుదీర్ఘ కెరీర్‌కు తెరదించుతూ ఆస్ట్రేలియా పర్యటనలో ఉండగానే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకుంటున్నట్టు ప్రకటించాడు. అనిల్ కుంబ్లే రిటైరయ్యాడు.. హర్భజన్ సింగ్ కెరీర్ చరమాంకంలో ఉన్నాడు. మరి.. దశాబ్దాలుగా భారత బౌలింగ్‌కు ప్రధాన ఆయుధంగా ఉన్న స్పిన్ దళాన్ని ముందుకు నడిపించేదెవరు? కుంబ్లే, హర్భజన్‌ల వారసత్వాన్ని కొనసాగించేదెవరు? ఇలాంటి సందేహాలు ముసురుకున్న వేళ భారత జట్టులోకి వచ్చాడు అశ్విన్. ఆరంభంలో సాధారణ బౌలర్‌గానే కనిపించినా, రానురాను తన శైలిని అసాధారణంగా మార్చుకున్నాడు. తన అమ్ములపొదిలోని ఒక్కో అస్త్రాన్ని బయటకు తీస్తూ ముందుకు సాగాడు. ఒక ఓవర్‌లో ఆరు బంతులను ఆరు రకాలుగా వేయగలిగే నైపుణ్యాన్ని సంతరించుకొని బ్యాటర్లకు కఠిన పరీక్షలా నిలిచాడు. బంతిని మధ్యవేలితో పట్టుకొని సంధించే క్యారమ్‌బాల్‌తో ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లను ముప్పుతిప్పలు పెట్టడం అశ్విన్‌కే చెల్లింది. క్రీడాకారులు చిన్నప్పుడు ఆటలను కెరీర్‌గా ఎంచుకునే క్రమంలో చదువుపై అంతగా దృష్టి సారించరు. కానీ, అశ్విన్ అందుకు భిన్నం. క్రికెట్‌పై ఆసక్తి పెంచుకుంటూనే చదువులోనూ రాణించాడు. ఏకంగా ఇంజనీరింగ్ పట్టభద్రుడయ్యాడు. మొదట మీడియం పేసర్‌గా క్రికెట్‌లోకి అడుగుపెట్టినా, అమ్మ సూచనతో ఆఫ్ స్పిన్ బౌలింగ్‌కు మారడం, అతని కెరీర్‌కు ఎంతో దోహదం చేసింది. కెరీర్ ఆరంభంలో అశ్విన్‌కు మోకాలి నొప్పి సమస్యగా ఉండేది. ఆ సమయంలో అమ్మ..'పేస్ బౌలింగ్‌తో ఎక్కువగా ఎందుకు పరుగులు పెడతావు? కొన్ని అడుగులు వేసేలా స్పిన్ బౌలింగ్




వేయొచ్చు కదా' అని కుమారుడికి సలహా ఇచ్చింది. వెంటనే బౌలింగ్ తీరును మార్చుకొన్న అశ్విన్.. తర్వాతి కాలంలో స్పిన్నర్‌గా అత్యున్నతస్థాయికి ఎదిగిన తీరు అమోఘం. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో సిరీస్ ఆడుతున్న సందర్భంలో తన తల్లికి గుండెపోటు వచ్చిందని తెలియడంతో పరామర్శకు వెళ్లి వచ్చి మళ్లీ ఆడడం అశ్విన్ అంకితభావానికి నిదర్శనం 'ప్రతి ఒక్కరికీ వీడ్కోలు సమయం వస్తుంది.. ఇప్పుడు నా వంతు' అని అశ్విన్ మీడియా సమావేశంలో హుందాగా వెల్లడించి ఆట నుంచి తప్పుకొన్నాడు. ప్రతి ఆటగాడు ఏదో ఒకరోజు గుడ్‌బై చెబుతాడు. ఇందులో విశేషమేమీ లేకపోవచ్చు. కానీ, తానెంచుకున్న ఆటపై అతని ప్రభావం ఎంత అనేదే ప్రధానాంశం. 106 టెస్టులాడిన అశ్విన్ 537 వికెట్లు పడగొట్టాడు. అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే తర్వాత రెండోస్థానంలో ఉన్నాడు. ఒక ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన ఘనతను 37 పర్యాయాలు అందుకున్నాడు. టెస్టుల్లో పదకొండుసార్లు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను ఖాతాలో వేసుకున్నాడు. ఇన్నిసార్లు ఈ అవార్డు అందుకున్న ప్రథముడిగా శ్రీలంక దిగ్గజ బౌలర్ ముత్తయ్య మురళీధరన్‌తో సమంగా నిలిచాడు. స్పిన్నర్ అంటే తమకు అనుకూలమైన పిచ్‌లపై మాత్రమే ప్రభావం చూపగలరన్న ముద్రను చెరిపేసిన బౌలర్. బంతితోనే కాదు, బ్యాటుతోనూ సత్తాచాటిన ప్రతిభావంతుడు అశ్విన్. ఎన్నో సందర్భాల్లో తనదైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత జట్టు విజయాల్లో తోడ్పాటు అందించిన అతడు నాలుగువేలకు పైగా పరుగులు కూడా రాబట్టాడు. టెస్టుల్లో ఆరుసార్లు శతకాలు సాధించి ఆల్‌రౌండర్‌గానూ తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. ప్రత్యర్థి జట్టును జయించే క్రమంలో సారథి రచించే ప్రణాళికలు, వ్యూహాల్లో ఎన్నోసార్లు భాగస్వామి అయ్యాడు. ఆటను సునిశితంగా పరిశీలిస్తూ, వైవిధ్యమైన ఆలోచనలతో రాజుకు మంత్రి తరహాలో అండగా నిలవడంలోనూ అశ్విన్‌కు మరెవరు సాటిరారు. ఇలా తనకు అంది వచ్చిన ప్రతి పాత్రలో పూర్తిగా ఒదిగిపోయిన అతను ఆటకు వందశాతం న్యాయం చేశాడు. భారత క్రికెట్ చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని లిఖించుకొన్నాడు. క్రికెట్ అభిమానుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆటను ప్రదర్శించి కెరీర్‌ను పరిపూర్ణంగా ముగించాడు.

# డిసెంబర్ 21న అరుదైన ఘటన..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

### -రాత్రి 16గంటలు..పగలు 8గంటలు..

ప్రజా స్వేచ్ఛ

సాధారణంగా ఒక రోజు అంటే.. పగలు 12 గంటలు, రాత్రి 12 గంటలు ఉంటుంది. అయితే శీతాకాలంతో పాటు కొన్ని సార్లు పగలు ఎక్కువగా ఉండటం, రాత్రుళ్లు తక్కువగా ఉండటం.. పగలు తక్కువగా ఉండి, రాత్రుళ్లు ఎక్కువగా ఉండటం జరుగుతుంది. సాధారణంగా ఇలా జరిగే ప్రక్రియను అయానంతం సోల్?స్టిస్ అంటారు. తాజాగా అలాంటి రోజు ఈ ఏడాది డిసెంబర్? 21వ తేదీన రాబోతుంది. ఈ రోజున పగటి సమయం(8గంటలు) తక్కువగా, రాత్రి సమయం(16గంటలు) చాలా ఎక్కువగా ఉంటోంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజున సూర్యుని నుండి భూమికి దూరం ఎక్కువగా ఉంటుంది. అలాగే చంద్రకాంతి భూమిపై ఎక్కువ కాలం ఉంటుంది. శీతాకాలపు అయనాంతం ఏర్పడిన రోజున భూమి దాని ధ్రువం వద్ద 23.4 డిగ్రీల వంపులో ఉంటుంది. ఈ సహజ మార్పు కారణంగా 2024, డిసెంబరు 21న ఈ ఏడాదిలో అత్యంత తక్కువ పగలు, సుదీర్ఘమైన రాత్రి ఏర్పడుతుంది. భూమి దాని అక్షం మీద తిరిగే సమయంలో దక్షిణ అర్ధగోళంలో భూమి నుండి సూర్యుడి దూరం గరిష్టంగా ఉన్న రోజున అయనాంతం వస్తుంది. ఇది ఏటా రెండుసార్లు జరిగే ఘట్టం. శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజు, తేదీ ఏటా మారుతూ ఉంటాయి. ఇక ఈ ఏడాది 21వ తేదీన ఈ అరుదైన ఘట్టం సంభవిస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే అది డిసెంబర్ 20- 23 తేదీల మధ్యనే వస్తుంటుంది. డిసెంబర్ 21న భూమికి సూర్యునికి గరిష్ట దూరం ఉండటం వల్ల సూర్యకిరణాలు ఆలస్యంగా భూమిని చేరుతాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతలో స్వల్ప తగ్గుదల కూడా కనిపిస్తుంది. దీంతో శీతాకాలంలో ఏర్పడే అయనాంతంపై పలు దేశాలలోని ప్రజలు పలురకాల నమ్మకాలను పాటిస్తుంటారు. చైనాతో పాటు ఇతర తూర్పు ఆసియా దేశాలలో, బౌద్ధమతంలోని యిన్, యాంగ్ శాఖకు చెందిన ప్రజలు శీతాకాలపు అయనాంతం ఐక్యత, శ్రేయస్సును అందించే రోజుగా భావిస్తారు. ఉత్తర భారతదేశంలో శ్రీకృష్ణునికి నైవేద్యం సమర్పించి, గీతాపారాయణం చేస్తారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో పుష్య మాస పండగను ఘనంగా జరుపుకుంటారు. సూర్యుడి ఉత్తరాయణ ప్రక్రియ శీతాకాలపు అయనాంతం నుంచి మొదలవుతుంది. అందుకే మన దేశంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్‌గా ప్రముఖ న్యాయవాది చల్లగుళ్ళ సుధారాణి





ప్రజా స్వేచ్ఛ ఎల్ బి నగర్

ఈ సందర్భంగా శ్రీమతి చల్లగుళ్ళ సుధారాణి గారు మాట్లాడుతూ, "చట్టపరమైన అవగాహనను పెంపొందించేందుకు, మానవ హక్కులను పరిరక్షించేందుకు, మరియు సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి ఒక్కరికి, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు, ప్రయోజనం చేకూర్చేలా కాంగ్రెస్ పార్టీతో కలిసి కృషి చేస్తాను" అని పేర్కొన్నారు.

ఈ బాధ్యతలను అప్పగించినందుకు టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ శ్రీ పొన్నం అశోక్ గౌడ్ గారికి, రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బొడ్డు భిక్షపతి గౌడ్ గారికి, మరియు తన నియామకానికి మద్దతు తెలిపిన న్యాయవాది సోదరులు మరియు సోదరీమణులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ. 600 కోట్లు: రేవంత్ రెడ్డి

### -కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారన్న రేవంత్

ప్రజా స్వేచ్ఛ

రూ. 600 కోట్ల డబ్బులు రావాల్సి ఉందని చెప్పారన్న సీఎం తానను జాగ్రత్త పడటం వల్ల రూ. 450 కోట్లు మిగిలాయని వ్యాఖ్య ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై శాసనసభలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. స్పీకర్ పోడియంలోకి కూడా దూసుకుపోయారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... అసెంబ్లీలో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై చర్చించాలని ఇంతకాలం కేటీఆర్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఈ-కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారని... రూ. 600 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని... వాటిని ఇవ్వాలని అడిగారని రేవంత్ చెప్పారు. మీరు ఓకే అంటే మరోసారి రేసింగ్




నిర్వహిస్తామని చెప్పారని తెలిపారు. ఎఫ్ఈవో ప్రతినిధులు తనను కలిసిన తర్వాతే తనకు ఈ విషయం తెలిసిందని చెప్పారు. కార్ రేస్ నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ. 600 కోట్ల విలువైనదని రేవంత్ అన్నారు. పెండింగ్ డబ్బుల కోసం నిర్వాహకులు తన వద్దకు వచ్చినప్పుడే ఆ విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. తాను జాగ్రత్త పడటం వల్ల రూ. 450 కోట్లు మిగిలాయని


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి, కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న హాఫీజ్ పేట్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్



ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 శేరి లింగంపల్లి ప్రతినిధి

హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ కాలని వాసూలు నేతృత్వంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలు చిన్నారుల ఆట పాటలతో సందడి గ కొనసాగింది, కార్యనిర్వహకులు సుధీష్ మరియు కాలని అసోసియేషన్ సభ్యుల ఆహ్వానం మేరకు వేడుకల్లో పాల్గొన్న బాలింగ్ గౌతమ్ గౌడ్ ప్రసంగిస్తూ పవిత్రమైన ఏసుక్రీస్తు జన్మదిన సంబరాల్లో భాగంగా సెమీ క్రిస్మస్ వేడుకల్లో మతాల అతీతంగా కాలని వాసులందరు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందంటూ ప్రతి సంవత్సరం ఇలాగే ఐకమత్యంతో అన్నీ పండుగలు చేసుకోవాలని కోరుకుంటున్నాను అనీ తెలియచేసారు ఈ కార్యక్రమంలో పాస్టర్ రమేష్, డబుల్ బెడ్రూమ్ కాలని అసోసియేషన్ సభ్యులు స్థానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## కేంద్రమంత్రి అమిత్ షా ను అవమానపరిచే విధంగా వ్యవహరించిన వారిపై చర్యకు డిమాండ్

### -బీజేవైఎం ఆధ్వర్యంలో రాజపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజపేట,డిసెంబర్ 20

కేంద్రమంత్రి అమిత్ షా ను అవమానపరిచే విధంగా భువనగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరించిన తీరుపై చర్యకు డిమాండ్ చేస్తూ శుక్రవారం రాజపేట బీజేవైఎం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.రాజపేట మండల బీజేవైఎం పార్టీ ప్రధాన కార్యదర్శి కోయ మధు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ లో వినతిపత్రం అందజేస్తూ, భువనగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవహరించిన తీరు ఫోటోను అందజేసి విలేకరులకు వివరాలు చెప్పారు. భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోట్నక్ ప్రమోద్ కుమార్, ఇతర కాంగ్రెస్ నాయకులు అమిత్ షా ఫోటో పట్ల వ్యవహరించిన అవమానకర కార్యక్రమం ప్రజాస్వామికమని విమర్శించారు. ఈ సంఘటన పై విచారణ జరిపి సంబంధిత కాంగ్రెస్ నాయకులైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల బిజెపి పార్టీ అధ్యక్షులు దాచేపల్లి రాజు, కుమ్మరి లక్ష్మణ్, భగవాన్ రెడ్డి, బెడిద కృష్ణ, చింతల కృష్ణ, దాచేపల్లి శ్రీనివాసులు, గౌటి రాజు, బీరయ్య, సిద్ధులు, శంకర్,మార్కశివ తదితరులున్నారు.

## అమిత్ షా కి రాహుల్ గాంధీ కి తేడా ఉంది

### -మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 పటాన్ చేరు ప్రతినిధి

రాహుల్ గాంధీ రోజు దేవుడిని మొక్కుతారు కానీ పబ్లిసిటీ చేసుకోరు బీజేపీ వాళు దేవుణ్ణి మొక్కి పబ్లిసిటీ చేసుకుంటారు అంబేద్కర్ రాజ్యాంగం అంటే దేశ ప్రజలకు ఒక ధైర్యం ఒక కవచం అంబేద్కర్ రాజ్యాంగం వల్లనే మోడీ అయినా అమిత్ షా అయినా పదవులు అనుభవిస్తున్నారు అంబేద్కర్ కు రాజ్యాంగ నిర్మాణానికి ప్రోస్థహించింది ఇచ్చింది జవరహర్ లాల్ నెహ్రూ దాన్ని కాపాడడానికి అహర్నిశలు కృషి చేస్తున్నది నెహ్రూ ముని మనవడు రాహుల్ గాంధీ దేశ ప్రజలు ఈరోజు ప్రశాంతంగా జీవిస్తున్నారు అంటే అంబేద్కర్ రాజ్యాంగ ఫలితమే అది మార్చాలని బిజెపి ప్రయత్నం చేస్తుంది అందుకే రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం చేస్తున్నారు దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి రాజకీయ కుట్ర చేసి రాహుల్ గాంధీనీ గత సంవస్తారం పార్లమెంట్ లో ఉండకుండా కుట్రలు చేశారు ఇప్పుడు కూడా రాహుల్ గాంధీ నీ పార్లమెంట్ కి రాకుండా దాడి చేసి అడ్డుకుంటున్నారు అయిన అంబేద్కర్ నీ అవమానించిన అమీత్ షా క్షమాపణ చెప్పే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపడు రాహుల్ గాంధీ ఏ పిలుపు నిచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సిద్ధంగా ఉన్నాము

# అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా ను బర్తరఫ్ చేయాలి





-అంబేద్కర్ కే కాదు దేశానికే అవమానం
-ఘట్ కేసర్ లో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం ,నేతల అరెస్ట్

ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 ఘట్కేసర్
బిజెపి కేంద్రమంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ ను అవమానించడాన్ని నిరసిస్తూ తక్షణమే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని ఘట్ కేసర్ మండల కేంద్రంలో కేవీపీఎస్ సీఐటీయూ, ఎన్ పి ఆర్ డి సంఘాల ఆద్వర్యంలో శుక్రవారం అమిత్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు దిష్టిబొమ్మ దగ్ధం చేయడాన్ని అడ్డుకున్న పోలీసులు నేతలను అరెస్ట్ చేశారు
-అనంతరం సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య ఎన్ సబితలు మాట్లాడుతూ అంబేద్కర్ ను అవమానిస్తే భారత రాజ్యాంగాన్ని అవమానించినట్టేనని, భారత రాజ్యాంగాన్ని అవమానిస్తే ఈ దేశాన్ని దేశ ప్రజలను అవమానించినట్టేనని అన్నారు, అమిత్ షా వ్యాఖ్యలు దేశ ప్రజలను, భారత రాజ్యాంగమును అగౌరవ పరిచేలా ఉన్నాయని అన్నారు. అమిత్ షా కేంద్ర హెూంమంత్రిగా పార్లమెంటులో ఉండడానికి అలాగే తనకు నచ్చిన మతం గురించి మాట్లాడడానికి స్వేచ్ఛనిచ్చింది అంబేద్కర్ అని గుర్తు చేశారు ఆయన రచించిన రాజ్యాంగమే ఆర్టికల్ 25 ప్రకారం70సార్లే కాదు700సార్లు ఆయన భగ్వన్నామ స్మరణ చేసుకోవచ్చన్నారు దేశంలో పలు సందర్భాల్లో బిజెపి నాయకులు రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రత్యక్షంగా ప్రకటించడం దేశ విద్రోహ చర్యగా పరిగణించాలని అన్నారు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగా బిజెపి ప్రభుత్వం ఈ రకమైనటువంటి వాక్యాలు చేస్తుందన్నారు ఒక గొప్ప సంఘ సంస్కర్త రాజ్యాంగ నిర్మాత అయినటువంటి అంబేద్కర్ ని ఒక ప్రజాస్వామ్య బద్ధమైన పదవిలో ఉండి కూడా విమర్శించడం సరైనది కాదన్నారు దీనికి వెంటనే అమిత్ షా తన పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షురాలు చిలుకమరి మహేశ్వరి ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు కొయ్యడ చంద్రమోహన్ ట్రాన్స్ పోర్ట్ యూనియన్ కార్యదర్శి కడమంచి యాదగిరి కె శోభ కే శ్రీలత పాపయ్య రఘు సాయి తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప దీక్ష కాలం పవిత్రమైనది

-కుబీర్ మణికంఠ అయ్యప్ప సన్నిధానం గురుస్వామి గంగాధర్

ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 ఆశమొల్ల మోహన్ బైంసా ప్రతినిధి
మాలధారణ స్వీకరించిన అయ్యప్ప స్వాములకు దీక్ష కాలం ఎంతో పవిత్రమైనదని కుబీర్ మణికంఠ అయ్యప్ప సన్నిధానం గురుస్వామి గంగాధర్ పేర్కొన్నారు, మండల కాలంలో పడిపూజలు పూజలు నిర్వహిస్తూ తమ దీక్షా కాలాన్ని కొనసాగిస్తారని తెలిపారు, కార్తీక మాసం నుండి మకర సంక్రాంతి వరకు శ్రీ మణికంఠుని అయ్యప్ప మాల ధరించే భక్తులు నిష్ఠగా దీక్షను కొనసాగించాలని సూచించారు, శుక్రవారం సన్నిధానంలో అయ్యప్ప మాల స్వీకరించిన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు,



అయ్యప్ప మాల ధరించిన వెంటనే ప్రతి ఒక్కరిలో నేను అన్న భావన తొలగిపోయి శారీరకంగా ఉండే పేరు వాటి కోసం ధరించే దుస్తులు, తీసుకునే ఆహారం, శారీరక సౌకర్యాలు, ఆచార వ్యవహారాలు, అన్ని అయ్యప్ప దీక్ష స్వీకరించిన వెంటనే తొలగిపోతాయని తెలిపారు, మాల ధరించిన వ్యక్తిని అంతరార్థంలో భగవంతుని స్వరూపడిగా జీవులందరిలోనూ దేవుడు ఉన్నాడనే భావనతో స్వామి అని పిలవాలని భక్తులకు సూచించారు, ఆయా గ్రామాల్లో సన్నిధానాలు నెలకొల్పి పూజలు చేస్తున్న భక్తులు నియమా నిష్టలతో అయ్యప్ప స్వామిని కొలిస్తే కోరిన కోరికలు తీరుతాయి అని తెలియజేశారు, ముఖ్యంగా కన్నె స్వాములు అత్యధికంగా పడిపూజలకు హాజరుకావాలని సూచించారు, తమ జీవితకాలంలో యువకులు తప్పకుండా అయ్యప్ప దీక్షను స్వీకరించి సన్మార్గంలోనడవాలని ఇతవు పలికారు

## బిడిఎల్ భనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం.

-కొడుకును హత్య చేసిన తండ్రి.




ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 పటాన్ చేరు ప్రతినిధి
ప్రతి రోజు మద్యం సేవించి కుటుంబ సభ్యులను వేదిస్తున్న కొడుకును కర్ర తో తలపై మోదీ హత్య చేసిన తండ్రి.మృతుడు వెంకట్ రెడ్డి గతం లో తల్లి పై దౌర్జన్యం చేసే కొట్టిన కేసులో జైలు శిక్ష అనుభవించాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 4 గం.లో సమయంలో ఇంటి వద్దనే హత్య .క్యాసారం గ్రామానికి చెందిన అతేలి అనంత రెడ్డి (63) తన కుమారుడైన మృతుడు అతెల్లి వెంకట్ రెడ్డి (34) ప్రతి రోజూ మద్యం సేవించి తల్లి తో పాటు తండ్రిని వేధిస్తున్నడని. .. మృతుడి తండ్రి తన దగ్గర వున్న కర్రతో తలపై గట్టిగా కొట్టడంతో ఆతెల్లి వెంకట్ రెడ్డి అక్కడికక్కడే మృతి.సమాచారం తెలుసుకున్న బిడిఎల్ బానూర్ పోలీస్ లు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పటాన్ చేరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హరిజనవాడ పాఠశాల బదిలీ టీచర్లకు ఘన సన్మానం



ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజపేట, డిసెంబర్ 20
రాజపేట మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినిలు కరుణ , మంగ లకు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల భాస్కర్ అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు సన్మాన మహెూత్సవం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజాపేట మండల విద్యాధికారి చందా రమేష్ , గౌరవ అతిథిగా రాజపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత , తాజా మాజీ మండల్ నోడల్ అధికారి బూరుగు మహేందర్ రెడ్డి , రిటైర్డ్ మండల విద్యాధికారి బల్ల దామోదర్ , రిటైర్డ్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీమతి , రామలింగాచారి వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొని బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్లిన ఇద్దరు టీచర్లను పలువురు శాలువా, జ్ఞాపక, పుష్పగుచ్ఛం, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం తో ప్రధానోపాధ్యాయులు ఆకుల భాస్కర్ సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు చెప్పారు.

## వీలైన తొందరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి



ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20 ఎల్ బి నగర్ నియోజకవర్గ ప్రతినిధి
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ నుంచి ఎస్ ఎఫ్ కాలనీలో వేస్తున్న రోడ్లను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జీ హెచ్ ఎం సి ఏ ఈ రాజ్ కుమార్ తో కలిసి పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత పాటించాలని,లెవెల్స్ సరిచూచుకుంటూ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చెయ్యాలని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆరె వెంకట్ రెడ్డి,నిట్టు కృష్ణ ప్రధాన కార్యదర్శి,చప్పిడి సత్యనారాయణ సహాయ కార్యదర్శి వెంకటేష్ గుప్తా,సుశీల్ కుమార్ మరియు వర్కింగ్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తిని దుర్వినియోగం చేస్తే సహించేది లేదు..

-కూన శ్రీశైలం గౌడ్..



కుత్బుల్లాపూర్ డిసెంబర్20 ప్రజా స్వేచ్ఛ
ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేస్తే సహించేది లేదు అని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.శుక్రవారం నియోజకవర్గంలోని కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొంపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రక్కన ప్రజల తాగు నీటి కోసం 2017 లో నిర్మించిన వాటర్ ట్యాంకులను ఎలాంటి సమాచారం అందించకుండా కాంట్రాక్టర్ కూలగొట్టిన తీరును తీవ్రంగా ఖండించి,అనంతరం కొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిత తనిఖీ చేసి విద్యార్థులకు మరుగుదోడ్లు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని హెడ్మాస్టర్ కి సూచించారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపెల్లి గ్రామ మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్, మాజీ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి,ఆదిరెడ్డి మోహన్ రెడ్డి,మాజీ వార్డ్ మెంబర్ కావాలి గోపాల్, పూర్ణచంద్రరావు, అశోక్ రెడ్డి, దశరథ్, ఆంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, ఖదీర్, నవీన్ ముదిరాజ్, మరియు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియా కన్వీనర్ కూతురు జన్మదిన వేడుకలు

ప్రజా స్వేచ్ఛ ప్రతినిధి రాజపేట డిసెంబర్ 20
రాజపేట మండలం దూది వెంకటాపురం గ్రామ సోషల్ మీడియా కన్వీనర్ బిమగని కరుణాకర్ కుమార్తె పుట్టినరోజు శుక్రవారం సందర్భంగా రాష్ట్ర కిసాన్ సెల్ కార్యదర్శి బుడిగే పెంటయ్య,దూది వెంకటాపురం గ్రమా మాజీ సర్పంచ్ వస్పరి విష్ణు,యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు గొడిశెల నగేష్,ఇర్గదిండ్ల వెంకటేష్ (ఏసు) తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటన ఏర్పాట్లును పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజా స్వేచ్ఛ డిసెంబర్ 20, కొల్చారం ప్రతినిధి
గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ఈ. నెల 22 వ తేదీన కొల్చారం మండలం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మెదక్ చర్చ్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో పర్యటన ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కొల్చారం సాంఘిక సంక్షేమ పాఠశాల లోడైనింగ్ హాల్, డార్మెటరీ, పరిసర ప్రాంతాలను అందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్లు శుక్రవారం పరిశీలించారు.గవర్నర్ పర్యటన రూట్ మ్యాప్ ను ప్రకారం పర్యటన కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. గవర్నర్ రాక మొదలుకుని , కార్యక్రమాలు పూర్తిచేసుకుని తిరిగి బయలుదేరే వరకూ షెడ్యూల్ ప్రకారం పర్యటన సాగేలా ఏర్పాట్లను గురించి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, కొల్చారం తాసిల్దార్ గఫర్,డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్ ఎంపీడీవో కృష్ణవేణి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

## హెూండా కార్లు ప్రియం



వచ్చే నెల నుంచి వాహన ధరలను 2 శాతం వరకు పెంచబోతున్నట్లు హెూండా కార్స్ ఇండియా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు లాజిస్టిక్ ఖర్చులు అధికమవడంతో సంస్థపై పడుతున్న భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునల్ బెహ్లా తెలిపారు. ప్రస్తుతం సంస్థ అమేజ్, సిటీ, ఎలివేట్ మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

## నయా చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్

**-సింగిల్ చార్జింగ్‌తో 153 కి.మీ.**
**-గరిష్ఠ ధర రూ.1.27 లక్షలు**

ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..చేతక్ బ్రాండ్‌లో మరో ఎలక్ట్రిక్ స్కూటర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 35 సిరీస్‌లో భాగంగా సంస్థ విడుదల చేసిన స్కూటర్లు మూడు రకాలు 3501, 3502, 3503గా లభించనున్నాయి. తొలి రెండు స్కూటర్ల ధర వరుసగా రూ.1.27 లక్షలు, రూ.1.20 లక్షలుగా నిర్ణయించిన సంస్థ, మూడో మాడల్ ధరను ప్రకటించలేదు ఈ ధరలు బెంగళూరు షోరూంనకు సంబంధించినవి. వీటిలో 3501 రకం ఈ నెల చివరి నుంచి, మరో రకం 3502 మాడల్ వచ్చే నెల నుంచి డెలివరీ చేయనున్నట్లు బజాజ్ ఆటో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేశ్ శర్మ తెలిపారు. వచ్చే ఏడాది ఈ-స్కూటర్‌ను ఇతర దేశాలకు ఎగుమతి చేసేయోచనలో సంస్థ ఉన్నట్లు చెప్పారు. ఈ-స్కూటర్ విభాగంలో సంస్థకు 27.6 శాతం వాటా ఉన్నది.

# రూ.89 వేల దిగువకు వెండి..
# వరుసగా మూడో రోజూ తగ్గిన బంగారం..!

వరుసగా మూడో రోజు బంగారం ధరలు దిగి వచ్చాయి. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్లు) ధర రూ.170 తగ్గి రూ.78,130లకు చేరుకున్నది. గురువారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం రూ.78,300 పలికింది. మరోవైపు శుక్రవారం కిలో వెండి ధర రూ.1,800 పతనమై రూ.88,150లకు చేరుకుంది. గురువారం కిలో వెండి ధర రూ.90 వేలు పలికింది. ఇక మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి డెలివరీ బంగారం తులం ధర రూ.50 పెరిగి రూ.75,071 వద్ద నిలిచింది. వెండి ఫ్యూచర్స్ మార్చి డెలివరీ ధర రూ.86,540 పలికింది. అంతర్జాతీయ మార్కెట్ కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం ధర 13.10 డాలర్లు వృద్ధి చెంది 2621.20 డాలర్లకు చేరుకుంది. ఇక ఔన్స్ వెండి ధర 0.41 శాతం



పతనమై 29.29 డాలర్లు పలికింది. వడ్డీరేట్ల తగ్గింపు విషయమై యూఎస్ ఫెడ్ రిజర్వ్ నిర్ణయం వల్లే బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయని బులియన్ మార్కెట్ నిపుణులు తెలుపుతున్నారు.

# ఆరు నెలల కనిష్టానికి ఫారెక్స్ రిజర్వు నిల్వలు..!

భారత్ ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు పతనం అయ్యాయి. ఈ నెల 13తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు దాదాపు రెండు బిలియన్ డాలర్లు పతనమై 652.87 బిలియన్ డాలర్లకు చేరాయని ఆర్బీఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇది ఆరు నెలల కనిష్ట స్థాయికి సమానం అని వివరించింది. ఈ నెల 13తో ముగిసిన వారానికి ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 1.988 బిలియన్ డాలర్లు తగ్గి 652.869 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకు ముందు ఐదో తేదీతో ముగిసిన వారానికి 3.235 బిలియన్ డాలర్లు పతనమై 654.857 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం కాకుండా ఆర్బీఐ జోక్యం చేసుకుంటున్నా, కొన్ని వారాలుగా ఫారెక్స్ రిజర్వు నిల్వలు పడిపోతూనే ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో ఫారెక్స్ రిజర్వ్ నిల్వలు 704.885 బిలియన్ డాలర్లతో



జీవిత కాల గరిష్టాన్ని తాకిన సంగతి తెలిసిందే. ఫారెక్స్ రిజర్వు నిల్వల్లో ప్రధానమైన ఫారిన్ కరెన్సీ అసెట్స్ 3.047 బిలియన్ డాలర్లు తగ్గిపోయి 562.576 బిలియన్ డాలర్లకు చేరాయని శుక్రవారం ఆర్బీఐ విడుదల చేసిన డేటా తెలిపింది. బంగారం రిజర్వు నిల్వలు 1.121 బిలియన్ డాలర్లు పతనమై 68.056 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్స్) 35 మిలియన్ డాలర్లు క్షీణించి 17.997 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)లో భారత్ రిజర్వ్ నిల్వలు 27 మిలియన్ డాలర్లు తగ్గి 4.24 బిలియన్ డాలర్ల వద్ద స్థిర పడ్డాయి.

# ఆస్ట్రేలియా సంచలన నిర్ణయం..
# యువ బ్యాటర్‌కు జట్టులో చోటు

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా జరగనున్న తుది రెండు టెస్టులకు సంబంధించిన జట్టును ఆస్ట్రేలియా ప్రకటించింది. 15 మంది సభ్యుల వివరాలను ప్రకటించిన క్రికెట్ ఆస్ట్రేలియా.. సంచలన నిర్ణయం తీసుకున్నది. కొత్తగా ప్రకటించిన జట్టు సభ్యుల్లో 19 ఏళ్ల యువ బ్యాటర్ సామ్ కొంటాస్‌కు చోటు కల్పించింది. ఆ టీనేజ్ బ్యాటర్ ఆస్ట్రేలియా క్రికెట్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. సుమారు 70 ఏళ్ల తర్వాత టెస్టు క్రికెట్‌లో చోటు దక్కించుకున్న ఆస్ట్రేలియా ప్లేయర్‌గా కొంటాస్ రికార్డు సొంతం చేసుకున్నాడు. మెల్‌బోర్న్, సిడ్నీల్లో జరిగే టెస్టుల్లో అతను ఆడే అవకాశాలు ఉన్నాయి. తొలి మూడు టెస్టులకు ఓపెనర్‌గా బరిలోకి దిగిన నాథన్ మెక్‌స్వీనేను జట్టు నుంచి తొలగించారు. అతను ఆరు ఇన్నింగ్స్‌లో కేవలం 72 రన్స్ మాత్రమే చేశాడు. దీంతో మెక్‌స్వీనేపై వేటు వేశారు. కొత్తగా ప్రకటించిన బృందంలో ఆల్‌రౌండర్ బ్యూ వెబ్‌స్టర్, పేస్ బౌలర్ సీన్ అబ్బాట్, జై రిచర్డ్‌సన్ కూడా ఉన్నారు. భారత్‌తో



జరిగిన మూడు టెస్టుల నుంచి కేవలం మెక్‌స్వీనేను మాత్రమే ఆస్ట్రేలియా వదులుకున్నది. ఒకవేళ తుది జట్టుకు కొంటాస్ ఎంపిక అయితే, అప్పుడు ప్యాట్ కమ్మిన్స్ తర్వాత టెస్టు అరంగేట్రం చేసిన అతిపిన్న వయసున్న ఆసీస్ క్రికెటర్‌గా అతను రికార్డు క్రియేట్ చేయనున్నారు. ఇటీవల ఆస్ట్రేలియా ప్రైమ్‌మినిస్టర్స్ లెవన్ జట్టుతో పాటు ఐసీసీ మెన్స్ అండర్ 19 క్రికెట్ వరల్డ్‌కప్‌లోనూ కొంటాస్ అత్యద్భుత ప్రదర్శన కనబరిచాడు. రై రిచర్డ్‌సన్, సీన్ అబ్బాట్‌లను కూడా 15 మంది బృందంలోకి తీసుకున్నారు.

# ఆయూశి విజృంభణ.. ఫైనల్లో యువ భారత్

### -అండర్-19 ఆసియాకప్ టోర్నీ


సింగపూర్: అరంగేట్రం మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ 4వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. టోర్నీలో అపజయమెరుగని భారత్..తుది పోరులో నిలిచింది. తొలుత ఆయూశీ శుక్లా(4/10) ధాటికి లంక 20 ఓవర్లలో 98/9 స్కోరుకు పరిమితమైంది. ఈ యువ లెఫ్టార్మ్ స్పిన్నర్ ధాటికి లంక బ్యాటర్లు స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. కెప్టెన్ మనుడి నానయకర(33) టాప్‌స్కోరర్‌గా నిలిచిందిపిచ్



పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఆయూశి స్పిన్ మాయాజాలంతో చెలరేగడంతో లంక దగ్గర సరైన సమాధానం లేకపోయింది. ఓపెనర్లు సంజన(9), హిరుణి హన్సిక(2) 12 పరుగులకే పెవిలియన్ చేరగా, ఐదో వికెట్‌కు నానయకర, నిసానసల నెలకొల్పిన 22 పరుగుల భాగస్వామ్యం అత్యుత్తమమైంది. ఆయూశీకి తోడు పరునిక సిసోడియా(2/27) రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత 99 పరుగుల కోసం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 14.5 ఓవర్లలో 102/6 స్కోరు చేసింది. పరుగుల ఖాతా తెరువకుండానే ఐశ్వరి(0) ఔట్ కాగా, కమలిని(28) ఆకట్టుకుంది. టోర్నీలో తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తున్న తెలంగాణ యువ బ్యాటర్ గొంగడి త్రిష(32) అత్యధిక స్కోరుతో జట్టు విజయంలో కీలకమైంది. లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ త్రిష తన ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 3 భారీ సిక్స్‌లతో అలరించింది. సనిక(4), కెప్టెన్ నికి ప్రసాద్(3), భవిక(7) విఫలమయ్యారు. ప్రభోద (3/16), గిమ్హాని (2/18) ఆకట్టుకున్నారు. నాలుగు వికెట్లతో విజయంలో కీలకమైన ఆయూశికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

## స్పోర్ట్స్

# లండన్‌లో స్థిరపడనున్న విరాట్ కోహ్లీ..




ఇండియన్ క్రికెట్ ప్లేయర్ విరాట్ కోహ్లీ లండన్‌లో స్థిరపడనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇటీవల కాలంలో ఎక్కువ సమయం కోహ్లీ లండన్‌లోనే గడిపాడు. ఇండియా నుంచి అతను తన బేస్‌ను త్వరలో మార్చనున్నట్లు చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ తెలిపారు. భార్య అనుష్కా శర్మ, పిల్లలతో కలిసి అతను లండన్ సెటిలవ్వలనుకుంటున్నాడు. అనుష్కా రెండో సారి ప్రెగ్నెంట్ అయిన తర్వాత ఆమె కోసం కోహ్లీ అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. విరాట్, అనుష్కా దంపతులకు లండన్‌లో ప్రాపర్టీ ఉన్నది. అక్కడే వాళ్లు ఎక్కువగా కాలం గడుపుతున్నారు. అకాయ్ పుట్టిన తర్వాత సమయాన్ని గడిపేస్తున్నారు. అయితే పర్మనెంట్‌గా లండన్‌కు వెళ్లిపోవాలన్న ఆలోచనలో కోహ్లీ ఉన్నట్లు తెలుస్తోంది. భార్యా, పిల్లలతో కలిసి అతను లండన్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నాడని రాజ్‌కుమార్ తెలిపారు. త్వరలోనే అతను ఇండియాను వదిలి వెళ్లనున్నట్లు చెప్పాడు. 36 ఏళ్ల కోహ్లీ ఇప్పటికే టీ20 మ్యాచ్‌లకు గుడ్‌బై చెప్పేశాడు. అయితే టెస్టులు, వన్డేలకు ఇంకెంత కాలం అతను ఆడుతాడన్న అంశాన్ని చెప్పలేమన్నారు.



# మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో రానున్న అనుపమ..

అందాల భామ అనుపమ పరమేశ్వరన్ ప్రస్తుతం ఆచి తూచి సినిమాలు చేస్తుంది. హీరోయిన్ గా ఒకొక్క పెట్టు ఎక్కుతూ వస్తున్న అనుపమ పరమేశ్వరన్ కెరీర్ బిగినింగ్ లో గ్రామర్స్ రోల్స్ కు దూరంగా ఉంటూ వచ్చింది. కానీ ఆతర్వాత టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం తన అందాలతో ఆకట్టుకుంది. ఓ రేంజ్ లో అందరు ఆరబోసి అభిమానులను కవ్వించింది ఈ కుర్రది. ఇక ఈ అమ్మడు కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ తోనూ ఆకట్టుకుంటుంది. ఎక్కువగా నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటుంది ఈ అమ్మడు. తాజాగా అనుపమ మరో ఇంట్రెస్టింగ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది.సూపర్ స్టార్ సురేష్ గోపి అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో కాస్మోస్ ఎంటర్టైన్మెంట్స్ పై జె. ఫణీంద్ర కుమార్ నిర్మాతగా ప్రవీణ్ నారాయణ దర్శకత్వంలో వస్తున్న యదార్ధ సంఘటనల ఆధారంగా వాస్తవిక దృక్పథ కోణంలో తీసిన సినిమా జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (జె. ఎస్. కె). బైజు సందోష్, మాధవ్ సురేష్ గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఇంటెన్స్ కోర్టు డ్రామాగా ఈ చిత్రాన్ని నిర్మించారు.అనుపమ పరమేశ్వరన్ సినిమాలో జానకి పాత్రలో నటిస్తోంది. యదార్ధ సంఘటన ఆధారంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో జానకి పై జరిగిన అన్యాయాన్ని కోర్టులో ఎలా ఎదుర్కొంది అన్న అంశాన్ని ఇంటెన్స్ డ్రామాగా నిర్మించారు. ఈ కేసును వాదించే లాయర్ పాత్రలో సూపర్ స్టార్ సురేష్ గోపి గారు నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరిలో విడుదల చేస్తామని మూవీ మేకర్స్ తెలిపారు




# పుష్ప 2 ది రూల్ రికార్డు వసూళ్లు .!

భారీ అంచనాల మధ్య విడుదలై ఎప్పటిలాగే సౌత్‌తోపాటు నార్తిండియన్ ప్రేక్షకులను ఫిదా చేస్తున్నాడు పుష్పరాజ్. ఐకాన్ అల్లు అర్జున్ సీక్వెల్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వచ్చి రికార్డు వసూళ్లతో ట్రెండింగ్ టాపిక్‌గా నిలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై న పుష్ప 2 ది రూల్ ఓపెనింగ్ డేనే జవాన్, ఆర్‌ఆర్‌ఆర్ రికార్డును బద్దలు కొట్టిందని తెలిసిందే. తాజా కలెక్షన్ల రిపోర్ట్‌తో పుష్పరాజ్ మేనియా ఎలా ఉందో అర్ధమవుతోంది.పుష్పరాజ్ ఏ మాత్రం తగ్గేదేలే అంటున్నారు. 15 రోజుల్లోనే రూ.1508 కోట్లు వసూళ్లు రాబట్టి అత్యధిక వేగంగా ఈ మార్క్ చేరుకున్న చిత్రంగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ఇప్పటివరకు ఆల్ టైమ్ హయ్యెస్ట్ గ్రాస్ ఇండియన్ మూవీస్ అమీర్ ఖాన్ దంగల్ (రూ.2070. 30 కోట్లు), బాహుబలి.. ది కంక్లూజన్ (రూ.1786.06 కోట్లు) పేర్లతో ఉన్న రికార్డ్‌ను పుష్ప 2 ది రూల్ అధిగమించడం ఖాయమని తాజా కలెక్షన్లు చెప్పకనే చెబుతున్నాయి. పుష్ప 2 మరికొన్ని రోజుల్లోనే ఈ ఫీట్ చేరుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రం కన్నడ సోయగం రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా ఇంప్రెస్ చేసింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషించారు.



# కీర్తి సురేష్ డెడికేషన్‌కు ఫిదా కావాల్సిందే..!

కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్ అంటే కేవలం ఆరు పాటలు నాలుగు సీన్స్ కు మాత్రమే పరిమితం అన్నట్టుగా ఉండేది ఇన్నాళ్లు పరిస్థితి. కానీ ఇప్పుడు సీన్ మారింది. స్టార్ హీరోయిన్లు కమర్షియల్ సినిమాల్లోనూ తమ మార్క్ చూపించేందుకు కష్టపడుతున్నారు. గ్లామర్ తో పాటు నటనకు కూడా స్కోప్ ఉండే రోల్స్ ను ఏరి కోరి సెలెక్ట్ చేసుకుంటున్నారు. కేవలం సినిమాలో నటించటం వరకే కాదు ఆ సినిమాల ప్రమోషన్ బాధ్యతలను కూడా నెత్తికెత్తు కుంటున్నారు. తమ పర్సనల్ లైఫ్ ఎఫెక్ట్ ఏ మాత్రం సినిమాల మీద పడకుండా చూసుకుంటున్నారు. అందుకే కోసం రిస్క్ చేసేందుకు కూడా రెడీ అంటున్నారు.రీసెంట్ గా పెళ్లి చేసుకొని ఫ్యామిలీ లైఫ్ లోకి ఎంటర్ అయిన కీర్తి సురేష్.. వారం రోజులు కూడా తిరక్కుండానే సినిమా పనులు స్టార్ట్ చేశారు. తన బాలీవుడ్ డెబ్యూ మూవీ బేబీ జాన్ ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. నార్త్ మూవీ కావటంతో ఆ సినిమా కంటెంట్ కు తగ్గట్టుగా హాట్ లుక్స్ తో కనిపిస్తూనే మన సాంప్రదాయం పట్ల తనకున్న గౌరవాన్ని కూడా చూపిస్తున్నారు కీర్తి. బేబీ జాన్ ప్రమోషన్స్ లో మెడలో పసుపు తాడుతోనే కనిపిస్తున్నారు ఈ బ్యూటీ.



# హాట్ ఫొటోలతో హీట్ ఎక్కిస్తోన్న టీమిండియా క్రికెటర్ భార్య..

టీమిండియా క్రికెటర్ యజువేంద్ర చాహల్ భార్య ధనశ్రీ వర్మ మల్టీపుల్ ట్యాలెంటెడ్. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్‌గా రాణిస్తున్న ధనశ్రీ డెంటిస్ట్, కొరియోగ్రాఫర్‌గా తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.యూట్యూబర్ గా కెరీర్ ప్రారంభించిన ఆమె పలు బాలీవుడ్ టీవీ రియాలిటీ షోస్ లోనూ పాల్గొంది. ఇక అందంలో స్టార్ హీరోయిన్లకు ఏ మాత్రం తక్కువకాదీ ముద్దుగుమ్మ.ఎనర్జిటిక్ డ్యాన్సర్ గా పేరున్న ధన శ్రీ వర్మ త్వరలోనే టాలీవుడ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇస్తుందని ఈ మధ్యన తెగ ప్రచారం జరుగుతోంది.ప్రముఖ డ్యాన్స్ మాస్టర్, ఢీ ఫేమ్ యష్ హీరో గా నటిస్తోన్న ఓ సినిమాలో ధన శ్రీ వర్మ కథానాయికగా కనిపించనుందని వార్తలు వినిపిస్తున్నాయి.ఈ క్రమంలో ధన శ్రీ వర్మ తాజాగా షేర్ చేసిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఇందులో బ్లాక్ కలర్ ఔట్ ఫిట్ లో కనిపిస్తూ నెటిజన్ల మతిపోగొడుతోందీ అందాల తార.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492